

సదాశివపేట మున్సిపాలిటీ కార్యాలయం


సదాశివపేట మున్సిపాలిటీలో వేసిన సీసీ మురుగుకాల్వ



## సదాశివపేట రూపురేఖలు మారాయి

సీఎం కేసీఆర్ మంజూరు చేసిన ప్రత్యేక నిధులతో సదాశివపేట రూపురేఖలు మారిపోయాయి. రూ. 25 కోట్ల నిధులతో ఎంతో అభివృద్ధి జరుగుతున్నది. సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించి ప్రజల ఇబ్బందులు తీరుస్తున్నాం. భవిష్యత్తులో సదాశివపేటను అభివృద్ధిలో ముందు వరుసలో ఉంచుతాం. నిధుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్‌కు కృతజ్ఞతలు.

*– చింతా గోపాల్, మున్సిపల్ వైస్ చైర్మన్*

మున్సిపాలిటీకి రూ. 25 కోట్లు మంజూరు చేసిన సీఎం కేసీఆర్


# అభివృద్ధికి కేరాఫ్ సదాశివపేట

- రూ.20 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు
- తీరిన రవాణా ఇబ్బందులు, మురుగు అవస్థలు
- హెచ్‌డీసీ చైర్మన్ చింతా ప్రభాకర్ కృషితో వార్డుల్లో కొనసాగుతున్న పనులు
- మౌలిక వసతుల కల్పన
- హర్షం వ్యక్తం చేస్తున్న పట్టణవాసులు

సదాశివపేట, అక్టోబర్ 13: ఉమ్మడి రాష్ట్ర పాలనలో అభివృద్ధికి నోచుకోని సదాశివపేట మున్సిపాలిటీ నేడు బీఆర్‌ఎస్ సర్కారు హయాంలో అభివృద్ధిలో పరుగులు పెడుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ సదాశివపేట మున్సిపాలిటీకి రూ. 25 కోట్లు ప్రత్యేక నిధులు మంజూరు చేసి రూపురేఖలు మార్చారు. ప్రజలకు మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. దీంతో సదాశివపేట మున్సిపాలిటీ అన్ని రంగాల్లో ముందువరుసలో ఉంది. పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు వివిధ అభివృద్ధి పనులు చకచకా కొనసాగుతున్నాయి. సదాశివపేట పట్టణానికి నయాలుక్ రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 25 కోట్లు

నారాయణఖేడ్ సభలో సీఎం కేసీఆర్ సదాశివపేట మున్సిపాలిటీకి రూ. 25 కోట్లు మంజూరు చేశారు. రాష్ట్ర చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింతా ప్రభాకర్ కృషితో ఈ నిధులు త్వరగా విడుదలయ్యాయి. రూ.20 కోట్లు సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజీ, ఓపెన్ డ్రైనేజీలకు కేటాయించగా, ఇప్పటి వరకు రూ.10 కోట్ల పనులు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మున్సిపాలిటీలో 12 కిలోమీటర్లు సీసీ రోడ్లు, 2.5 కిలోమీటర్లు సీసీ డ్రెయిన్స్, 800 మీటర్లు అండర్ డ్రైనేజీల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా వార్డుల్లో పనులు కొనసాగుతున్నాయి. సీసీ రోడ్ల నిర్మాణంతో ప్రయాణ ఇబ్బందులు తొలిగిపోయాయని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో మొత్తం 26 వార్డులు ఉన్నాయి. ఆయా వార్డుల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల పనులు కొనసాగుతున్నాయి. కొన్ని వార్డుల్లో పనులు పూర్తికాగా, 5, 7 వార్డుల్లో 70 శాతం పూర్తయ్యాయి. త్వరలో అన్ని వార్డుల్లో పనులు పూర్తికానున్నాయి.


సదాశివపేట మున్సిపాలిటీలో వేసిన సీసీ రోడ్డు


హుస్నాబాద్‌లో నిర్మించిన ఐవోసీ భవనం


అక్కన్నపేట మండలంలోని గౌరవెల్లి రిజర్వాయర్

- తొమ్మిదేండ్లలో రూ. 9,076 కోట్లు ఖర్చుచేసిన ప్రభుత్వం
- కండ్ల ముందు కనిపిస్తున్న పనులు
- మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వవైభవం
- కోట్లాది రూపాయలతో మారిన రూపురేఖలు
- సీఎం కేసీఆర్ సహకారంతో అభివృద్ధి చేసిన హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్ కుమార్
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

# అభివృద్ధిలో హుస్నాబాద్‌షా

## నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు

సిద్దిపేట, అక్టోబర్ 13(నమస్తే తెలంగాణ ప్రతినిధి): హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతున్నది. వేల కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనులు కండ్ల ముందు కనిపిస్తున్నాయి. సీఎం కేసీఆర్ సహకారంతో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక కృషితో స్థానిక ఎమ్మెల్యే వొడితెల సతీశ్‌కుమార్ నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ముందుంచారు. ఇక్కడి ప్రాంత ప్రజల కలను సాకారం చేశారు. గత ప్రభుత్వాల హయాంలో మాటలకే పరిమితమైన పనులను పూర్తి చేసి అభివృద్ధి, సంక్షేమంలో హుస్నాబాద్‌ను ముందు వరుసలో నిలిపారు. ఇక్కడి ప్రాంత రైతుల చిరకాల కోరిక అయిన గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టును పూర్తి చేశారు. దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉన్న మహాసముద్రంగండి చెరువు పూర్తి చేయడంతో ఆఫలాలు రైతులు అందుకుంటున్నారు. శనిగరం మధ్యతరహాప్రాజెక్టును ఆధునీకరించారు. మిషన్ కాకతీయతో చెరువులకు పూర్వవైభవం వచ్చింది. హుస్నాబాద్ పట్టణంలో సెంట్రల్ లైటింగ్, గౌరవెల్లి ప్రాజెక్టు భూనిర్వాసితులకు పరిహారం, హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరణ చేపట్టారు. రహదారులకు మహర్దశ వచ్చింది. సిద్దిపేట-ఎల్కతుర్తి జాతీయ రహదారి విస్తరణ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. నూతన గ్రామ పంచాయతీల ఏర్పాటు, కులవృత్తులకు జీవనోపాధి, ఇలా ఏరంగంలో చూసుకున్నా అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచింది. ఒకనాడు ఎట్లున్న హుస్నాబాద్ ఎట్లయ్యింది. ఆ ఫలాలు ప్రజల ముందు కనిపిస్తున్నాయి.



హుస్నాబాద్‌లో నిర్మించిన టీటీసీ భవనం



మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్


హుస్నాబాద్‌లో కొత్తగా నిర్మించిన ఇండోర్ స్టేడియం

### హుస్నాబాద్ నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇలా..

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం జిల్లాల పునర్విభజనలో సిద్దిపేట జిల్లాలో కలిసింది.సిద్దిపేట జిల్లాలో నియోజకవర్గ కేంద్రమైన హుస్నాబాద్‌తో పాటు అక్కన్నపేట, కోహెడ మండలాలు, కరీంనగర్ జిల్లాలో చిగురుమామిడి, సైదాపూర్ మండలాలు, హనుమకొండ జిల్లాలో ఎల్కతుర్తి, భీమదేవరపల్లి మండలాలు ఉన్నాయి. సిద్దిపేట, కరీంనగర్, హనుమకొండ జిల్లాలో విస్తరించి ఉంది. 2014, 2018లో వరుసగా రెండు సార్లు ఇక్కడి నుంచి వొడితెల సతీశ్‌కుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సతీశ్‌కుమార్‌నే గులాబీ అధినేత సీఎం కేసీఆర్ నిలబెట్టారు. ఈసారి విజయం సాధించి హ్యాట్రిక్ కొట్టాలనే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పని చేస్తున్నారు. 2014 నుంచి 2023 వరకు నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్రణాళిక సిద్ధం చేసుకొని బీఆర్‌ఎస్ క్యాడర్ ముందుకు పోతుంది.హుస్నాబాద్ నియోజకవర్గంలో ఈ తొమ్మిదేండ్లలో అభివృద్ధి, సంక్షేమ పథకాలకు కలిపి సుమారు రూ. 9,076 కోట్లు వెచ్చించారు. వీటిలో నుంచి ఒక అభివృద్ధి పనులకే రూ. 5,649 కోట్లు ఖర్చు చేయగా రూ.3,427 కోట్లు సంక్షేమ పథకాలకు వెచ్చించారు.

- హుస్నాబాద్ మున్సిపాలిటీ భవనం, దవాఖాన, మాతాశిశు సంరక్షణ కేంద్రం, ఎల్లమ్మ చెరువు సుందరీకరణతో పాటు అంతర్గత రహదారులు, ఇండోర్ స్టేడియంతో పాటే ఏసీపీ కార్యాలయం, విద్యుత్ డీఈ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ. 245 కోట్లు ఖర్చు చేశారు.
- గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంగా ప్రతి గ్రామ పంచాయతీకి ట్రాక్టర్ అందించారు. గ్రామాల్లో డంపు యార్డులు, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాల నిర్మాణాలకు రూ. 122 కోట్లు ఖర్చు చేశారు.
- నియోజకవర్గంలో సోషల్ వెల్ఫేర్ ఎస్టీ గురుకులం, బంజారా భవన్, షాదీఖానా భవనాలను రాష్ట్ర ప్రభుత్వం రూ. 101 కోట్లతో నిర్మించింది.
- రైతాంగానికి కరెంట్ ఇబ్బందులు లేకుండా నియోజకవర్గం వ్యాప్తంగా 16 కొత్త సబ్‌స్టేషన్లు నిర్మించారు. వీటితో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు ఇతర పనుల కోసం రూ. 340 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేశారు.
- అన్ని గ్రామాల్లో పంచాయతీ రాజ్, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాల కోసం రూ. 654 కోట్లు ఖర్చు చేశారు.
- హుస్నాబాద్ మండలంలో మహాసముద్రం గండితో పాటు పొట్లపల్లి చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ. 6 కోట్లతో పనులు పూర్తి చేశారు.
- ఎల్కతుర్తి మండలంలో అన్నాసాగర్, పెద్దవాగు మీద చెక్ డ్యామ్‌లను రూ. 8 కోట్లతో చేపట్టారు.
- అక్కన్నపేట, కోహెడ మండలాల నూతన పోలీస్ స్టేషన్ భవనాలను రూ. 3.5కోట్లతో నిర్మించారు.
- అక్కన్నపేట, కోహెడ మండలంలో 12 చెక్‌డ్యామ్‌లను రూ. 70 కోట్లతో నిర్మించారు.
- సైదాపూర్, చిగురుమామిడి మండలాల్లో రూ.79 కోట్లతో కాల్వల నిర్మాణం చేపట్టారు.
- ప్రభుత్వం సమీకృత కార్యాలయ భవన సముదాయ నిర్మాణానికి రూ. 19 కోట్లు వెచ్చించారు.
- నియోజకవర్గంలో కరువును శాశ్వతంగా దూరం చేసి గోదావరి జలాలను తీసుకురావడానికి గౌరవెల్లి ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 2700 కోట్లు కేటాయించి త్వరగా పనులు పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేసింది. ఇటీవలనే ట్రయల్ రన్ సైతం నిర్వహించారు.
- తాగునీటి సమస్యను తీర్చడం కోసం ఇంటింటికీ మిషన్ భగీరథ నీటిని అందించి ఆడబిడ్డల నీటి కష్టాలను తీర్చారు. ఇందుకు రూ. 710 కోట్లు ఖర్చు చేశారు.
- గోదాముల నిర్మాణాకి రూ. 42 కోట్లు ఖర్చు చేసి నిర్మించారు.
- రైతుల సమావేశాలు నిర్మించడం కోసం క్లస్టర్ వారీగా రూ. 8 కోట్లతో మొత్తం 38 రైతు వేదికలు నిర్మించారు.


కోహెడ మండలంలోని పోరెడ్డిపల్లి రోడ్డు కమ్ చెక్‌డ్యామ్


హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకట్ట సుందరీకరణలో వాకింగ్ ట్రాక్ నిర్మాణం


అత్యంత సుందరంగా కాకతీయుల నాటి ఎల్లమ్మ చెరువు ప్రధాన తూము



హుస్నాబాద్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన బస్తీ దవాఖాన


కోహెడ మండలంలోని చెక్‌డ్యామ్